
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 12 మార్చి 2024





	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	35	24
భద్రాద్రి కొత్తగూడెం	37	25





భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న సీఎం, మంత్రులు

మణుగూరులో జరిగిన ప్రజాదీవెన సభలో అభివాదం చేస్తున్న సీఎం, మంత్రులు

ఖమ్మం మా ఊపిరి



భద్రాచలంలో జరిగిన సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాద్రి పర్యటన ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. అటు ప్రభుత్వ కార్యక్రమంలో, ఇటు పార్టీ కార్యక్రమంలో రేవంత్ తనదైన శైలిలో ప్రసంగించారు. రాజకీయ ప్రత్యర్థులను పదునైన మాటలతో చీల్చిచెండాడారు. ఆరు గ్యారంటీల్లో ఐదోదైన ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని భద్రాచలంలోని రామయ్య సన్నిధిలో ఘనంగా ప్రారంభించారు. అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో మొత్తం తొమ్మిది మంది మంత్రులు పాల్గొనడం విశేషం.

ఆద్యంతం సమరోత్సాహం

- వడివడిగా సాగిన సీఎం పర్యటన
- రాజకీయ ప్రత్యర్థులపై పదునైన విమర్శలు
- రామక్షేత్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం
- మణుగూరు సభతో ఎన్నికల ప్రచారం
- హాజరైన తొమ్మిది మంది మంత్రులు
- కాంగ్రెస్ శ్రేణుల్లో ఫుల్ జోష్

భద్రాచలం మార్చి 11: సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రేవంత్ తొలిసారిగా సోమవారం భద్రాద్రి జిల్లాలో పర్యటించారు. ముందుగా ఆయన హైదరాబాదులోని బేగంపేట ఎయిర్‌పోర్టునుంచి బయలుదేరి యాదగిరిగుట్టలో శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి బూర్గంపాడులోని సారపాక బీపీఎల్ పాఠశాల హెలీప్యాడ్‌కు మధ్యాహ్నం 12.50 గంటలకు చేరుకున్నారు.

మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా సీఎంకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో భద్రాద్రి రామాలయానికి చేరుకున్నారు. అక్కడ దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సీఎం రేవంత్‌కు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. అనంతరం భద్రాచలంలోని మార్కెట్ యార్డు ప్రాంగణానికి చేరుకుని అక్కడ సహచర మంత్రులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టారు. భోజన విరామం తర్వాత నీటి పారుదలశాఖ, దేవదాయ శాఖ, భద్రాద్రి దేవస్థానం అధికారులు, కలెక్టర్ ప్రియాంకతో కలిసి సీఎం రేవంత్ అంతర్గత సమీక్ష నిర్వహించారు. అనంతరం సారపాక బీపీఎల్ పాఠశాలలోని హెలీప్యాడ్‌కు చేరుకుని అక్కడ నుంచి మణుగూరు ప్రజాదీవెన బహిరంగ సభకు చేరుకొని ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సభలో బీఆర్ఎస్, బీజేపీలపై రేవంత్ విమర్శలు చేశారు. సభ ముగిసిన అనంతరం సాయంత్రం 5.35గంటలకు మణుగూరు నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. మొత్తంగా సీఎం పర్యటన ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రారంభమై సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టి చివరి రాజకీయ యుద్ధ శంఖారావంతో ముగిసింది. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపింది.



- తెలంగాణ ఉద్యమం ఇక్కడే మొదలైంది...
- ఆ స్ఫూర్తితోనే ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించాం
- బీఆర్‌ఎస్‌ను బొందపెట్టింది ఇక్కడి ప్రజలే...
- ఏ ఎన్నికల్లోనూ ఇక్కడ బీఆర్‌ఎస్‌ను నమ్మలేదు..
- కాంగ్రెస్ పార్టీలో ఈ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది..
- అమలుకాని హామీలతో కేసీఆర్ మోసం చేశారు
- మణుగూరు ప్రజాదీవెన సభలో సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం జెట్ స్పీడ్ పర్యటన

మధ్యాహ్నం 12.50కు సారపాకలోని హెలీప్యాడ్‌కు..
12.57కు రోడ్డు మార్గంలో భద్రాచలం రామాలయానికి..
1.30కు ఆలయం నుంచి బయలుదేరారు.
1.38కు ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభోత్సవం
2.35 నుంచి 2.54 వరకు ప్రసంగం
2.55 నుంచి 3.29 వరకు భోజన విరామం
3.30కు అధికారులతో సమీక్ష
4.10కు సారపాక హెలీప్యాడ్‌కు ప్రయాణం
4.25కు మణుగూరుకు చేరుకున్నారు.
5.30కు వేదిక నుంచి హెలీపాడ్‌కు వెళ్లారు.
5.35కు నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం

ఖమ్మం/మణుగూరు/అశ్వాపురం/కరకగూడెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమం ఖమ్మం నుంచే మొదలైందనీ, ఇక్కడి నుంచి మొదలైన ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణ సాధించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరులో గల ఐటీఐ కళాశాల మైదానంలో సోమవారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్రజాదీవెన సభలో ఆయన ప్రసంగించారు.







ఎందరో త్యాగాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న రాష్ట్రంలో కేసీఆర్ పదేళ్ల ముఖ్యమంత్రిగా చేసి, అనేక రకాల హామీలు ఇచ్చి తెలంగాణ సమాజాన్ని మోసం చేశాడన్నారు. ఖమ్మం జిల్లాలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మలేదన్నారు. 2014, 2018, 2023 ఎన్నికల్లో పార్టీని గెలవనియ్యలేదన్నారు. బీఆర్ఎస్‌ను 100 మీటర్ల గొయ్యి తీసి బొందపెట్టిన జిల్లా ఖమ్మం జిల్లా అన్నారు. ప్రపంచానికి సూర్యుడు తూర్పున ఉదయించి ఎలా వెలుగునిస్తాడో.. రాష్ట్రానికి ఖమ్మం జిల్లా తుర్పున ఉండి స్ఫూర్తినిస్తుందన్నారు. కాంగ్రెస్‌లో ఖమ్మం జిల్లాకు ప్రత్యేకత ఉందన్నారు. మన్‌మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఖమ్మం జిల్లా నుంచే ఇద్దరు కేంద్ర మంత్రులను చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత కేబినేట్‌లో ఇచ్చిన పదవులను లెక్కపెట్టి కాంగ్రెస్ పార్టీకి ఖమ్మం జిల్లా ఎంత ముఖ్యమో ఆలోచన చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సంక్షేమ పథకం రాములవారి ఆశీస్సులతో ప్రారంభించుకోవడం జిల్లాకు ఇచ్చే ప్రాధాన్యత అని గమనించాలన్నారు. ఖమ్మం జిల్లాకు ఇచ్చే ప్రాధాన్యత జాతీయస్థాయిలో కూడా తెలుసన్నారు.

మొట్టమొదటిసారి 2007లో రాజకీయాల్లో భాగంగా ఖమ్మం జిల్లాకు వచ్చాననీ, ఏ రోజు ఎలా వచ్చినా, ఎన్ని కష్టాల్లో వచ్చినా ఖమ్మం జిల్లా ప్రజలు అండగా నిలబడి గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారన్నారు. తనతో ఎలాంటి రక్త సంబంధం లేకపోయినా భుజాలమీద మోసి శాసనసభ ఎన్నికల్లో పది సీట్లకు తొమ్మిది గెలిపించి ఇందిరమ్మ రాజ్యం, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఖమ్మం జిల్లాలోని కార్యకర్తలే ఏర్పాటు చేశారన్నారు.

కాంగ్రెస్ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు, కార్యకర్తల మీద అక్రమ కేసులు పెడుతున్నప్పుడు, పార్టీ నాయకులు భయపడి ఇళ్లల్లో దాక్కున్నప్పుడు కార్యకర్తలే కత్తి చేత పట్టి కాంగ్రెస్ జెండాను మోసి రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తామని చెప్పి నిలబెట్టారన్నారు. సోనియాగాంధీ ఆరు గ్యారంటీలను అభయ హస్తం రూపంలో మాట ఇచ్చిందనీ, మాట తప్పని, మడమ తిప్పని నాయకురాలు ఎవరైనా ఉన్నారంటే తాను సోనియాగాంధీ అన్నారు. 2004లో కరీంనగర్ జిల్లాలో సోనియా గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారన్నారు. కాంగ్రెస్ హయాంలో రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ అని ప్రాజెక్టులు కడితే వాటికి సీతారామ అని పేరు మార్చి రూ. కోట్లు కొల్లగొట్టి ఖమ్మం జిల్లాకు తాగడానికి నీళ్ల లేని పరిస్థితి తీసుకొచ్చారన్నారు. మీ జిల్లాలో ఒకచప్రాసి ఉండూ... ఒంటికన్ను శివరాసన్ ఏడున్నాడు.. బాగా నీలిగిండు.. మా కార్యకర్తలపై అనేక కేసులు పెట్టించాడు... అంటూ జిల్లా మాజీ మంత్రిపై విమర్శ చేశారు.

బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యారనీ, వాళ్లిద్దరూ ఒక్కటై కాంగ్రెస్‌ను ఓడించాలని కుట్రలు చేస్తున్నారన్నారు. అందుకోసమే బీజేపీ వాళ్ల 9 సీట్లు ప్రకటించారనీ, అక్కడ బీఆర్ఎస్ ఎవరినీ ప్రకటించడంలేదన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి కనిపిస్తే తెలంగాణ ప్రజలు చెప్పుతో కొడతారనీ, చీకట్లో ఒప్పందం చేసుకుని అలాయ్‌బలాయ్ చేసుకుంటున్నారని, మోదీ, కేడీ కలిసి కాంగ్రెస్ పార్టీపై కుట్రలు చేస్తున్నారన్నారు. వారు కుట్రలు చేస్తుంటే చూస్తూ ఊరుకోమన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థి బలరాం నాయక్‌ను లక్షన్నర మెజార్టీతో గెలిపించాలని సీఎం కోరారు.

ఎంపీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికల బరిలో ఉన్న కేంద్ర మాజీ మంత్రి బలరామ్ నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ పిలుపునిచ్చారు. సీఎం సభకు చేరుకునే సరికి మంత్రి తుమ్మల తన ప్రసంగాన్ని రెండు నిమిషాలకే పరిమితం చేశారు. తాను ఎవరో జిల్లా ప్రజలందరికీ తెలుసునని మళ్లి నియోజకవర్గ ప్రజలను ప్రత్యేకంగా కలుస్తానని అంటూ మంత్రి తుమ్మల తన ప్రసంగాని ముగించారు. సభలో ఇంకా ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు పొంగులేటి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, మహబూబాబాద్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, రాష్ట్ర సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భద్రాద్రి అభివృద్ధికి సిద్ధం

- స్థల సేకరణ ఎంత కావాలో తేల్చండి
- ఇళ్లు కోల్పోయే వారికి భరోసా కల్పించండి
- నెలరోజుల్లో నివేదిక ఇవ్వండి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

4



భద్రాచలంలో ఇళ్ల పథకం ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎస్సీ, ఎస్టీల గృహాలకు రూ.6 లక్షలు ఇస్తాం
- ఇందిరమ్మ ఇళ్ల వద్దనే ఓట్లు అడుగుతాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- భద్రాచలంలో ఐదో గ్యారంటీ అమలుకు శ్రీకారం

4





మణుగూరు, భద్రాచలంలో జరిగిన సభలకు హాజరైన జనం

రంజాన్ సందడి షురూ..

- మసీదులకు విద్యుద్దీపాల అలంకరణ
- హలీం, సేమ్యా దుకాణాలు సిద్ధం



ఇఫ్తార్ : 6:23 (మంగళవారం)
సహర్ : 4:57 (బుధవారం)

ఖమ్మం సాంస్కృతికం, మార్చి 11: నెలవంక దర్శనమివ్వటంతో సోమవారం రాత్రి పవిత్ర రంజాన్ నెల ఆరంభమైంది. ఉపవాస దీక్షలు ఆరంభంకావటంతో రంజాన్ పండుగ సందడి షురూ అయ్యింది. ఖమ్మంనగరంలోని ముస్లింల, ఖిల్లా ప్రాంత వీధుల్లో రంజాన్ సందడి కనిపిస్తోంది.. మసీదులు, ప్రార్ధన స్థలాల వీధులు విద్యుత్ కాంతులతో అలరారుతున్నాయి. మరో వంక రంజాన్ రుచులకు దుకాణాలు సిద్ధమయ్యాయి.

రంజాన్ పండుగకు ముందు నెల రోజులను ముస్లిం సోదరులు పరమ పవిత్రంగా భావించి ఖురాన్ ప్రార్ధనలను అత్యంత నియమ నిష్టలతో ఆచరిస్తారు.. దీంతో ఖమ్మం నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా మసీదులు, ఈద్గాల వద్ద రంజాన్ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. మసీదులు, ఈద్గాలు తదితర ప్రార్ధన స్థలాలను శుభ్రపరిచి ప్రార్ధనలకు సిద్ధం చేశారు. ఇస్లాం విశ్వాసులు ఖురాన్ ప్రార్ధనలతోపాటు ఉపవాస దీక్షలు పాటిస్తారు. నిర్దీత వేళల్లో నమాజ్‌లను పాటించటంతోపాటు దాన ధర్మాలను విధిగా ఆచరిస్తారు. తద్వారా రంజాన్ నెలంతా పవిత్ర భావనలతోపాటు దానధర్మాలతో కాలం గడుపుతారు. రంజాన్ నెలలో పలు రకాల ఆహార రుచులు పండుగలో అంతర్భాగం కావటంతో ఆయా దుకాణాలను ఏర్పాటు చేశారు. హలీం దుకాణాలు నగర వ్యాప్తంగా వెలిశాయి. గోధుమ రవ్వ, చికెన్, మటన్ తదితర దినుసులతో తయారు చేసే హలీం వంటకాన్ని ముస్లింలే కాక అన్ని మతాల వారు ఆదరిస్తారు. పాయసాలకు ఉపయోగించే సేమ్యా, తదితర సామాగ్రి , అత్తరు దుకాణాలను సైతం వ్యాపారులు ఏర్పాటు చేస్తున్నారు.



ఖమ్మంలో మసీదు వీధిని విద్యుద్దీపాలతో అలంకరించిన దృశ్యం



చంద్రబాబును ఆహ్వానించిన నామా

ఖమ్మం కార్పొరేషన్, మార్చి11: ఈనెల 25వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లలో జరిగే తన కుమారుడు భవ్యతేజ వివాహానికి రావాల్సిందిగా బీఆర్ఎస్ లోకసభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆహ్వానించారు. ఆ మేరకు నామా సోమవారం చంద్రబాబును ఆయన నివాసంలో కలిసి వివాహ ఆహ్వానపత్రికను అందచేశారు. వివాహానికి కుటుంబ సమేతంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. నామావెంట ఆయన కుమారుడు భవ్యతేజ ఉన్నారు.

ఇంటర్నల్ పోస్టుల భర్తీని వేగవంతం చేయండి

సింగరేణి సీఎండీ బలరాం

రుద్రంపూర్, (సింగరేణి) మార్చి 11: సింగరేణిలో ఖాళీగా ఉన్న పోస్టులను ఇంటర్నల్ అభ్యర్థులతో భర్తీ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సింగరేణి చైర్మన్‌అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఆదేశించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సోమవారం నూతన నియామకాలు, ఇంటర్నల్ పోస్టుల భర్తీపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సంస్థ పరిధిలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 173 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. మరో 1,073పోస్టుల భర్తీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఖాళీ పోస్టుల భర్తీకోసం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సింగరేణిలో నూతన బొగ్గుబావుల ఏర్పాటుకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్‌వీకే. శ్రీనివాస్, డైరెక్టర్లు బి.సత్యనారాయణరావు, వెంకటేశ్వర్ రెడ్డి, జీఎంలు హనుమంతరావు, బసవయ్య, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం


సీఎంతో భట్టి ముచ్చట


దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పొంగులేటి..


ముఖ్యమంత్రితో తుమ్మల చర్చ.


కలెక్టర్‌కు సూచనలిస్తున్న శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి


సీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

ఆర్థిక ఇబ్బందులున్నా.. ప్రజల కోసమే ప్రతి పైసా ఖర్చు

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



ఖమ్మం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ పాలన వైఫల్యం, పాలకుల దోపిడీ పర్వానికి భిన్నంగా ప్రజల కోసం పనిచేస్తున్నామని, ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నా.. పైసా పైసా పోగేసి ప్రజాసంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. భద్రాచలం, ఐటీడీఏ, ఏజెన్సీలో తాగునీటి సౌకర్యం, బ్రిడ్జిల నిర్మాణం, వైద్య సౌకర్యాలు అన్నీ సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పాలనలోనే అమలు జరిగాయన్నారు. తెలంగాణ చరిత్రలో నేడు సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని, సొంత ఇంటి కల సాకారమవుతుందని, భద్రాచలం శ్రీసీతారాముల సన్నిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభమైందన్నారు. గతంలో నిర్మించిన ఇందిరమ్మ గృహాలకు సైతం హక్కుపత్రాలు జారీ చేస్తామన్నారు. బీఆర్ఎస్ పాలనలో డబుల్‌బెడ్‌రూంల పేరిట అల్లుడు, బిడ్డ ఇంటికి వస్తే ఎక్కడ పడుకుంటారంటూ అపహాస్యం చేసిన పాలకులు.. తమ పాలనలో ఒక్క ఇల్లు కూడా ఇచ్చిన పాపాన పోలేదని ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీల పథకంలో ఐదు గ్యారంటీలు అమల్లోకి వచ్చాయన్నారు. బడ్జెట్ ఓటాన్ అకౌంట్‌గా ప్రవేశ పెట్టినపప్పటికి ప్రజల సంక్షేమ పథకానికి రూ.7,740 కోట్ల బడ్జెట్‌ను కేటాయించామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ప్రతి పేద కుటుంబానికి అందిస్తామని ప్రకటించారు.

ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం


వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



ఖమ్మం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి చూపుతుందని, ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భద్రాద్రి సీతారాముల సన్నిధిలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. శ్రీరాముని దయ వలన అన్ని మండలాలు, గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, పేదలదరికి ఇందిరమ్మ గృహాలు అందించాలన్న సోనియమ్మ ఆకాంక్షలను నెరవేరుస్తామని ప్రకటించారు. వాజేడు మండలంలోని మోడికుంటవాగు ప్రాజెక్టు పెండింగ్‌లో ఉందని, వెంకటాపురం మండలంలోని పాలెం వాగు, దమ్ముగూడెం మండలం పెగళ్లపాడు ఎత్తిపోతల పథకాలను సాకారం చేసుకున్నామన్నారు. సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు నీరందించే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆనాడు నిర్మించిన కరకట్ట ఇంకా సుభాష్‌నగర్ వద్ద పెండింగ్‌లో ఉందని, త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. 80 అడుగుల మేర గోదావరికి వరదలు వచ్చినా భద్రాచలం పట్టణంలోకి చుక్కనీరు రాకుండా చూసే బాధ్యత తమదన్నారు. విద్యుత్‌పై అప్పులు డిప్యూటీ సీఎం భట్టి నెత్తి, సివిల్ సప్లయీస్ అప్పులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నెత్తిపై ఉన్నాయని, మొత్తం భారం సీఎం రేవంత్‌రెడ్డి మోయాల్సి వస్తోందని, అయినా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రాష్ట్ర కేబినెట్ సాగుతుందన్నారు.

డబుల్ బెడ్‌రూం బొమ్మలతో మోసగించిన కేసీఆర్

గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి



ఖమ్మం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): డబుల్‌బెడ్‌రూం ఇళ్ల బొమ్మలు చూపుతు కేసీఆర్ ప్రజలను మోసగించాడని, తుదకు శ్రీరాముడిని సైతం వంద కోట్లు ఇస్తామని మోసం చేశాడని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణ సాధ్యమయ్యే హామీలు మాత్రమే ఇచ్చి అమలు చేస్తున్న తీరును గమనించాలన్నారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో 2.90లక్షల డబులబెడ్‌రూంలకు టెండర్లు పిలిచి 1.49 లక్షలు ఇళ్లు నిర్మించారని కానీ 95వేల గృహాలు మాత్రమే పేదలకు పంపిణీ చేశారని విమర్శించారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 గృహాల చొప్పున మంజూరు చేస్తున్నామని, ప్రతి ఇందిరమ్మ గృహాన్ని రూ.5లక్షల వ్యయంతో నిర్మిస్తున్నామని, దళితులు, గిరిజనులకు రూ.6లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏడు లక్షల కోట్ల అప్పులు పేరుకుపోయినప్పటికి సీఎం రేవంత్‌రెడ్డి పేదప్రజల సంక్షేమకోసం, హామీల అమలుకోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నారని తెలిపారు. పార్టీలకు అతీతంగా అతి పేదలందరికి మొదటి విడతలో స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. గిరిజనుల్లో అర్హత కలిగిన పోడు రైతులకు పట్టాలు అందిస్తామని, పోడుభూముల సాగుకోసం బోర్లు వేసుకునేందకు ఆదేశాలు జారీచేస్తామని, సాగునీరు అందితేనే పంటలు పండుతాయని పేర్కొన్నారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

» అడుగడుగునా తనిఖీలు » అడవులను జల్లెడ పట్టిన పోలీసులు


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

మణుగూరు రూరల్, మార్చి 11: నక్సల్స్ ప్రభావిత ప్రాంతం అయిన మణుగూరులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొదటి సారిగా పర్యటనకు రావడంతో ఎస్పీ రోహిత్ రాజ్, డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. మణుగూరు సబ్ డివిజన్ లో గల అటవీ ప్రాంతాలను ప్రత్యేక బలగాలు పెద్ద ఎత్తున బాంబ్ డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టారు. ప్రధాన రహదారిపై ఉన్న ప్రతీ కల్వర్ట్, బ్రిడ్జిలను నిశితంగా తనిఖీ చేశారు. నక్సల్స్ కొరియర్లను ముందస్తుగా అదుపులో తీసుకుకున్నారు. ఐదుగురు ఎడిషనల్ ఎస్పీలు, 15 డీఎస్పీలు, 35 మంది సీఐలు, 65 మంది ఎస్ఐలు 175 మందిని ఏఎస్ఐలు, 320 మంది హెడ్ కానిస్టేబుళ్లు , 65 మంది మహిళా కానిస్టేబుళ్లు, 235 మంది హోంగార్డులతో కలపి మొత్తం 1100 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఎస్కార్ట్ వాహనం ఢీకొని ఏఎస్పీకి గాయాలు

భద్రాచలం, మార్చి 11: రాష్ట్రానికి చెందిన ఒక మంత్రి ఎస్కార్ట్ వాహనం ఢీకొని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్‌కు గాయాలయ్యాయి. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి భద్రాచలం పర్యటనలో భాగంగా మార్కెట్ యార్డులో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్లపథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి వస్తున్న సమయంలో ఆ మంత్రి కాన్వాయ్‌లోని ఎస్కార్ట్ వాహనం ఢీకొంది. ఈ క్రమంలో ఒక్కసారిగా ఏఎస్పీ పరితోష్ పంకజ్ పడిపోయారు. దీంతో ఆయనకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం భద్రాచలంలోని వైద్యశాలకు తరలించారు. కాగా తక్షణ వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈసమయంలో ఐజీ ఎవీ రంగనాథ్, ఎస్పీ రోహిత్‌రాజ్ ఆయన్ను పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం పరితోష్ పంకజ్‌ను హైదరాబాద్ తరలించారు.


ఏఎస్పీని హైదరాబాద్‌కు తరలిస్తున్న దృశ్యం

సీఎం చేతుల మీదుగా.. ఇందిరమ్మ ఇల్లు

దుమ్ముగూడెం, మార్చి 11: దుమ్ముగూడెం మండలానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల్ని అందుకున్నారు. భద్రాచలంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో చినబండిరేవుకు చెందిన వాగెబోయిన సుగుణ, చిననల్లబల్లికి చెందిన సున్నం లక్ష్మీకుమారి సీఎం రేవంత్‌రెడ్డి ప్రొసీడింగ్స్, ఇంటి నమూనాలను అందజేశారు. మండలం నుంచి మొత్తం 25 మందిని తహసీల్దార్ ఎంపిక చేయగా, వారిలో ఇద్దరికి సీఎం చేతుల మీదుగా ప్రొసీడింగ్స్ అందుకునే అవకాశం దక్కింది.


సుగుణ దంపతులు

సీఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు

» పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



మణుగూరు, మార్చి 11: ప్రజా దీవెన బహిరంగ సభలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నియోజకవర్గ సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పులుసుబొంత ప్రాజెక్టు ముందుకు సాగడం లేదని తెలిపారు. వర్షాకాలంలో అశ్వాపురం, సారపాక మండలాల జనావాసా లను ముంపునకు గురవుతున్నారని తెలిపారు. వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

రవిశంకర్.. బాగున్నావా..!

భద్రాచలం, మార్చి 11: భద్రాచలం వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకుడు రవిశంకర్‌ను ఆప్యాయంగా పలకరించారు. భోజన సమయంలో అక్కడే ఉన్న రవిశంకర్‌ను చూసి.. 'రవి ఎలా ఉన్నావు.. అంటూ ఆప్యాయంగా పలకరించారు. గతంలో రేవంత్ తో పాటు రవిశంకర్ కాంగ్రెస్‌లో చేరారు. భద్రాచలం వచ్చిన సందర్భంగా సీఎం... రవిశంకర్ తో ముచ్చటించారు.

ప్రజల కలలు సాకారం చేయండి

» భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్



భద్రాచలం, మార్చి 11: భద్రాచలం ప్రజల కలలను సాకారం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథక ప్రారంభ సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. భద్రాద్రి అభివృద్ధికి నిధులు కేటాయించి భద్రాద్రి వాసుల మనస్సులో చిరస్థాయిగా నిలవాలని కోరారు. ఐదు పంచాయతీల భద్రాద్రిలో విలీనం, ముంపునుంచి శాశ్వత రక్షణకు కృషిచేయాలన్నారు.

సీఎం సభ హైలెట్స్



మణుగూరుటౌన్, మార్చి 11: మణుగూరులో సోమవారం సాయంత్రం జరిగిన సీఎం ప్రజా దీవెన బహిరంగ సభ విజయవంతమైంది.

- సీఎం రేవంత్‌రెడ్డి కన్నా ముందే వచ్చిన మంత్రి సీతక్క ప్రసంగించగా.. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రసంగిస్తుండగా సీఎం రేవంత్‌రెడ్డి సభావేదికపైకి చేరుకున్నారు.
- మంత్రి సీతక్క కేటీఆర్ కామారెడ్డిలో చేసిన వాఖ్యలపై ఘాటుగా సమాధానమిచ్చారు.
- ఉద్యోగాలు అడిగిన నిరుద్యోగులపై కేసులు పెట్టి జైళ్లకు పంపారని మంత్రి సీతక్క అన్నారు.
- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు రెండు ముక్కల్లో తమ ప్రసంగాలను ముగించారు.
- కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై గెలిచి కన్నతల్లినే మోసం చేసిన చందంగా పార్టీ మారిన ఎమ్మెల్యేలను వదిలిపెట్టేది లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆక్రమించిన వారిని వదలబోమని హెచ్చరించారు.
- భద్రాద్రి జిల్లాకు నాడు సూపర్‌క్రిటికల్ టెక్నాలిజీతో నిర్మించాల్సిన బీటీపీఎస్‌ను సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నాడు సీఎం కేసీఆర్ నిర్మించిన బీటీపీఎస్ భద్రాద్రి జిల్లాకు భారం కాబోతుందని విమర్శించారు.
- సభలో మంత్రులు మాట్లాడుతుండగానే ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో పాటు మరికొందరు సీఎం రేవంత్‌రెడ్డిని శాలువాలతో సత్కరించారు.
- కొమ్ములతో కూడిన ఆదివాసీల తలపాగాను సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే పాయం పెట్టి గిరిజన సంస్కృతిని, సంప్రదాయాలను వివరించారు.
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క ప్రసంగాన్ని ప్రారంభించగానే ప్రజలనుంచి పెద్దఎత్తున హర్షధ్వానాలు వెల్లువెత్తాయి.
- సభ ప్రాంగణంలో అమర్చిన మూడు రంగుల బెలూన్లను ప్రజలు పోటీపడి తీసుకుపోయారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

» ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి » భద్రాచలంలో ఐదో గ్యారంటీ అమలుకు శ్రీకారం

ఖమ్మం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దశాబ్ద కాలంగా రాష్ట్ర ప్రజలను డబుల్‌బెడ్‌రూం గృహాల పేరిట కేసీఆర్ ,ఐఏవై గృహాల పేరిట మోదీ మోసగించారని, రానున్న ఎన్నికల్లో వారు నిర్మించిన గృహాల వద్దనే ఓట్లు అడగాలని, కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ గృహాల వద్దనే ఓట్లు అడుగుతుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రూ.5లక్షల వ్యయంతో ప్రతి పేదవారికి పక్కా గృహం నిర్మిస్తామని దళితులు, గిరిజనులకు రూ.6లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడం జరుగుతుందని వెల్లడించారు. రూ.22,500కోట్ల వ్యయంతో నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమల్లో 5వ గ్యారంటీ అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీతారాముల సన్నిధిలో సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పేదలు ఆత్మ గౌరవంతో బ్రతకాలన్న ఆకాంక్షతోనే మహిళల పేరిట ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు జారీ చేస్తున్నట్టు తెలిపారు. గత పదేళ్ల కాలంలో కేసీఆర్ డబుల్ బెడ్‌రూం గృమాలు ఇస్తామంటూ పేదల కలలపై ఓట్ల వ్యాపారం చేశాడని , నమ్మి మోస పోయిన ప్రజలు గత ఎన్నికల్లో కేసీఆర్, బీఆర్ఎస్‌ను బొందపెట్టి ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిన 48 గంటల వ్యవధిలోనే ఆరు గ్యారంటీల పథకం అమలు ప్రారంభమైందన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాతో కాంగ్రెస్‌కు బలమైన బంధం ఉందని, కమ్యూనిస్టులు, కాంగ్రెస్ నడుమ ఎన్ని వైరుధ్యాలున్నప్పటికి నేడు అభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం ఐక్యంగా సాగుతున్నాయన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు గత మూడు పర్యాయాలు కూడా కేసీఆర్ మాటలు నమ్మలేదని, మాయమాటలకు లొంగలేదని ప్రశంసించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించారు.

కట్టెలపొయ్యిలతో కన్నీరు పెడుతున్న మహిళలను సైతం మోదీ, కేసీఆర్‌లు మోసం చేశారని, గ్యాస్ సిలిండర్ ధరను రూ.400 నుండి 1200వరకు పెంచారని ధ్వజమెత్తారు. మహిళలను కాపాడుకోవాలన్న తపనతోనే ఇందిరమ్మ ప్రభుత్వం రూ.500 గ్యాస్ సిలిండర్ అమల్లోకి తెచ్చిందని, ఉచితంగా 200 యూనిట్లు విద్యుత్ అందిస్తుందని, పేదల నివాస గృహాల్లో వెలుగులు నింపుతుందన్నారు.

దేశానికే ఆదర్శంగా తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పథకాలను అమలు చేసి చూపుతుందన్నారు. జర్నలిస్టులు సైతం పేదవారే ఉన్నారని, పోయినోళ్ల మాదిరిగా కాకుండా జర్నలిస్టులందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రేవంత్‌రెడ్డి హామి ఇచ్చారు. 2022 నాటికి వంద శాతం గృహాలు నిర్మిస్తామని ప్రకటించిన ప్రదాని మోదీ రాష్ట్రంలో ఎన్ని ఇళ్లు నిర్మించారో చూపించాలని, ఆఊర్లలోనే ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. 2022 నాటికి రెండు రెట్ల ఆదాయం పెంచుతామని ప్రకటించిన మోదీ ఢిల్లీ సరిహద్దుల్లోఓ చరైతుల ఆందోళనలపై అమానుషంగా కాల్పులు జరిపి రైతులను బలి తీసుకున్నాడని ఆరోపించారు.ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15లక్షలు వేస్తామని మోదీ 15 పైసలు కూడా వేయలేదని , 20కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ ఎవరికి ఉద్యోగాలు ఇచ్చారో చూపాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్, బీజేపీలను అడుగుతాం, కడుగుతాం, బండకేసి కొడతామని స్పష్టం చేశారు. ఇంకా సభలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ప్రజా దీవెన సభలో మంత్రులు..

ఖమ్మం/మణుగూరు/అశ్వాపురం/కరకగూడెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరులో గల ఐటీఐ కళాశాల మైదానంలో సోమవారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్రజాదీవెన సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు.

కాంగ్రెస్ కంచుకోట ఉమ్మడిఖమ్మం జిల్లా: డిప్యూటీ సీఎం భట్టి

కాంగ్రెస్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లా కంచుకోట అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పినపాక నియోజవర్గంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గుర్తు పై గెలిచిన ఎమ్మెల్యే కన్నతల్లి లాంటి పార్టీకి ద్రోహం చేసి పార్టీ మారడమే కాక పార్టీ కార్యాలయాన్ని ఆక్రమించుకున్నారని అన్నారు. కాంగ్రెస్‌పార్టీకి ద్రోహం చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గానికి 3500 ఇల్లు మంజూరి చేస్తూ నిరుపేదలకు కాంగ్రెస్ అభయ హస్తం అందించబోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం నచ్చనివారు కావాలని విమర్శలు చేస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించిన రోజును స్వర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజుగా అభివర్ణించారు. రానున్న రోజుల్లో భద్రాద్రి పవర్ ప్రాజెక్టు ప్రభుత్వానికి భారం కాబోతుందన్నారు. రాష్ట్రంలో సంపదను పెంచి పేదలకు పంచుతామనీ ఎన్నికల ముందే చెప్పామనీ, అది తప్పకుండా చేస్తామన్నారు.

పాలకులం కాదు సేవకులం: మంత్రి పొంగులేటి

ప్రజల ఆశీసులతో గెలిచిన తామంతా పాలకులం కాదని ప్రజల సేవకులమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రసంగం ప్రారంభంలోనే పినపాక నియోజకవర్గ ప్రజలంతా తన కుటుంబం అని సంబోధించగా హర్షద్వానాలు మిన్నంటాయి. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మొహబూబబాద్ ఎంపి అభ్యర్థిగా పోరిక బలరాం నాయక్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అందుకు మనమంతా సిద్ధంగా ఉన్నమని రెండు చేతులెత్తి చూపాలని పొంగులేటి కోరగా సభకు హాజరైన వారంతా జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేస్తూ చేతులు పైకి ఎత్తారు.

కాళ్లు నాకే సంస్కృతి మీదే: మంత్రి సీతక్క

సీఎం రేవంత్ రెడ్డిపై కారుకూతలు కూస్తున్న కేటిఆర్ నాడు నీ తండ్రి కేసీఆర్ ఎవరి బూట్లు నాకి వచ్చారో చెప్పాలని మంత్రి సీతక్క కేటీఆర్‌పై మండిపడ్డారు. ఆదివారం కామారెడ్డిలో జరిగిన సభలో కేటిఆర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తుంటే వాటిని ,చూసి ఓర్వలేక కేసీఆర్, కేటీఆర్‌లు అక్కస్సు వెళ్లగక్కుతున్నారన్నారు. ఇంటికో ఉద్యోగాన్ని ఇస్తామన్న కేసీఆర్ అధికారంలోకి వచ్చాక అన్ని పదవులు ఇంట్లో వారే తీసుకున్నారని ఉద్యోగాలు అడిగిన నిరుద్యోగులను కేసులు పెట్టి జైళ్లకు పంపించారన్నారు.

భద్రాద్రి అభివృద్ధికి సిద్ధం

» అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

భద్రాచలం, మార్చి 11: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది.. ఏ మేరకు అభివృద్ధి చేసేందుకు వీలుంటుంది? ఎంత స్థలం సేకరించాల్సి ఉంటుందో తేల్చండి... అంటూ దేవాదాయశాఖ అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

భద్రాచలంలో సోమవారం నీటిపారుదల శాఖ, దేవాదాయ శాఖ అధికారులతో సీఎం, మంత్రులు అంతర్గత సమీక్ష నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ ప్రభుత్వ స్థలం భద్రాచలంలో ఎంత మేరకు ఉందో పరిశీలించాలని అధికారులకు సూచించారు. అలాగే ఆలయాభివృద్ధికి ఎన్ని ఇళ్లు తొలగించాల్సిన అవసరం ఉందని ప్రశ్నించగా ఈ సమయంలో అధికారులు 48 ఇళ్ల వరకు ఉండే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలో తేలిందన్నారు. ఆలయాభివృద్ధి కోసం సంబంధిత ఇళ్ల యజమానులతో సుహృద్భావ వాతావరణంలో మాట్లాడాలని వారికి నష్టం లేకుండా న్యాయం జరిగేలా ప్రభుత్వం చూస్తుందనే భరోసా ఇవ్వాలని సీఎం సూచించినట్లు సమాచారం.

ఇళ్లను కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయంగా స్థలాన్ని కేటాయించడమే కాకుండా ఇళ్లను సైతం నిర్మించి ఇవ్వాలని ఈ విధానంను లాటరీ పద్ధతిలో నిర్వహించాలని దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవిలను ఆదేశించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన నివేదికను నెల రోజుల్లో ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు ప్రభుత్వం సర్వదా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా నీటిపారుదల శాఖ అధికారులకు సీతమ్మసాగర్ ప్రాజెక్టు, భద్రాద్రి కరకట్ట మిగులు పనులు నాణ్యతతో సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు ఉత్తమకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, కూనంనేని సాంబశివరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సీఎంకు జ్ఞాపిక అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య


ఆదివాసీ మహిళలతో మంత్రి సీతక్క

సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం..

బూర్గంపాడు, మార్చి 11: భద్రాచలం పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక బీపీఎల్ స్కూల్ మైదానానికి హెలీకాప్టర్‌లో చేరుకున్నారు. రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖ చేరుకొగా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, ఐజీ రంగనాథ్, కలెక్టర్ ప్రియాంక అల, ఎస్పీ రోహిత్‌రాజ్ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన భద్రాచలం బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, రాందాస్‌నాయక్, జారె ఆదినారయణ, మట్టా రాగమయి, కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ ఉన్నారు. హెలీప్యాడ్ వద్దకు మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావును అనుమతించకపోవడంతో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పోలీసుల తీరుపై అగ్రహం వ్యక్తం చేయగా, చివరకు అనుమతించారు.

ఏపీలో చంద్రబాబుపై మరో కేసు

» అసైన్డ్ భూముల కేసులో ఏ-40గా చేర్చిన సీఐడీ

విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం మరో కేసు నమోదు చేసింది. ఇప్పటి వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫైబర్‌గ్రిడ్ కేసుల్లో నిందితుడిగా చేర్చిన సీఐడీ.. తాజాగా అసైన్డ్ భూముల కేసు ఎఫ్ఐఆర్‌లోనే గాక చార్జిషీటులోనూ నిందితుడి(ఏ-40)గా పేర్కొంది. రాజధాని అమరావతిలో వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, మందడం, రాయపూడి గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూములను బినామీ పేర్లతో కొనుగోలు చేశారని వరప్రసాదరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై మాజీ మంత్రి పి.నారాయణ, ఆయన కుటుంబ సభ్యులపై సీఐడీ గతంలో కేసులు (క్రైం నంబర్ 14/2020, 15/2020) నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్‌లలో ఎక్కడా చంద్రబాబు పేరు లేదు. ఇప్పుడు 14/2020 కేసులో ఆయనతో పాటు 22 మందిని నిందితులుగా పేర్కొంటూ విజయవాడ ఏసీబీ కోర్టులో సోమవారం చార్జిషీటు, మెమో దాఖలు చేసింది. వీరిలో నారాయణ బంధువు పి.సుబ్రహ్మణ్యాన్ని ఏ-41గా చేర్చింది. వీరందరిపై ఐపీసీ 120బీ, 420, 506 రెడ్‌విత్ 120బీ సెక్షన్లు, అసైన్డ్ భూముల బదిలీ నిషేధం చట్టంలోని సెక్షన్ 7, ఎస్సీ, ఎస్టీ చట్టంలోని 3(1)(జీ), (2)(వీఏ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 2 కేసులకు సంబంధించి ఒకటే చార్జిషీటును కోర్టుకు సమర్పించారు. కాగా, యువగళం ముగింపు సభలో లోకేశ్ చేసిన రెడ్‌బుక్ వ్యాఖ్యలపై సీఐడీ వేసిన పిటిషన్‌పై విచారణ 21వ తేదీకి వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలుకు ఆయన తరఫు న్యాయవాది లక్ష్మీనారాయణ సమయం కోరారు. ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో న్యాయాధికారి హిమబిందు విచారణను 21వ తేదీకి వాయిదా వేశారు.

సామరస్యమే సమాజానికి రక్షణ కవచం

● సీపీ సునిల్‌దత్

ఖమ్మంక్రైం, మార్చి11: సామరస్యమే సమాజానికి రక్షణ కవచం అని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా సోమవారం ముస్లిం మతపెద్దలతో తన కార్యాలయంలో సమవేశం పోలీసుకమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా ఖమ్మం పోలీసు కమిషనరేట్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీపీ లాఅండ్‌ఆర్డర్ జి.ప్రసాదరావు, ఎస్‌బీ ఏసీపీ ప్రసన్నకుమార్, ముస్లిం మతపెద్దలు మహ్మద్ అజీజ్, ఎస్‌డీ షబ్బీకర్, ఎస్‌డీ మహబూబ్‌లీ, హఫీజ్‌మన్నన్ పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ ఆదాయం రూ.19.37లక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 11: మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఆర్టీసీ ఉమ్మడి జిల్లాలోని పలు శివాలయాలకు ఆర్టీసీ నుంచి ఏర్పాటు చేసిన బస్సులకు రూ.19.37లక్షల ఆదాయం వచ్చినట్లు రీజనల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తీర్థాల హుండీ ఆదాయం - రూ.38.68 లక్షలు

ఖమ్మం రూరల్: మండల పరిధిలోని తీర్థాల సంఘమేశ్వరాలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న తీ ర్థాల జాతర సోమవారం ముగిసింది. కాగా ఐదు రోజులకు సంబంధించి హుండీ ఆదాయం మొత్తం రూ.38.68 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శేషయ్య తెలిపారు.

కోటిలింగాల ఆదాయం - రూ.3లక్షలు

కారేపల్లి: మండల పరిధిలోని పోలంపల్లి గ్రామంలో గల కోటిలింగాల జాతరకు రూ.3లక్షల5వేల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ చీమల కృష్ణయ్య తెలిపారు. అదే విధంగా ఉసిరికాయలపల్లి గ్రామంలో గల కోటమైసమ్మ తల్లి కి ఖమ్మం పట్టణానికి చెందిన పసుమర్తి నాగేశ్వరరావు, పద్మజ దంపతులు రూ.లక్షా20వేల విలువ గల బంగారు నానుతాడును అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి11: నగరంలోని జూబ్లీక్లబ్‌లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా తుబూరి దయాకర్‌రెడ్డి, సెక్రటరీగా కటికల క్రిష్టఫర్‌బాబు, ట్రెజరర్‌గా ప్రసాదరావు, ఛీఫ్ ప్యాట్రన్‌గా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా సామినేని హరిప్రసాద్, మల్లేష్, మేకల మల్లిబాబు, గొర్ల ప్రభాకర్‌రెడ్డి, వి. ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా నాగప్రసాద్, సుధాకర్, పిచ్చయ్యయాదవ్, మోతారపు సుధాకర్, లక్ష్మీనారాయణలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఎన్నికను రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అబ్జర్వర్ స్వాతిముత్యం, జిల్లా ఒలంపిక్ సంఘం బాధ్యులు, జిల్లా క్రీడల శాఖ అబ్జర్వర్ గౌస్ తదితరులు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కబడ్డీ సంఘాన్ని పలు క్రీడా సంఘాల సభ్యులు అభినందించారు.

ఐఎంఎల్ డిపో ఎదుట మద్యం వ్యాపారుల నిరసన

వైరా, మార్చి 11: వైరాలోని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఐఎంఎల్ డిపోలో సోమవారం కూడా మద్యం ఎగుమతులు నిలిచిపోయాయి. మద్యంపై వ్యాట్ ట్యాక్స్ విధించటాన్ని నిరసిస్తూ ఉమ్మడి జిల్లాలోని మద్యం వ్యాపారులు ఈ చలానాలు తీయకుండా ఐఎంఎల్ డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. మద్యంపై వ్యాట్ ట్యాక్స్ తగ్గించే వరకు ఈ చలానాలు తీసే ప్రసక్తే లేదని వ్యాపారులు స్పష్టం చేశారు. తమ మద్యాన్ని తీసుకువెళ్తున్న వాహనాలను సేల్ ట్యాక్స్ అధికారులు అడ్డుకొని, పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ వ్యాట్ ట్యాక్స్ సమస్యను పరిష్కరించే వరకు మద్యాన్ని కొనుగోలు చేయబోమని స్పష్టం చేశారు. మద్యం వ్యాపారులు శనివారం, సోమవారం ఆందోళన చేయడంతో ఎగుమతులు లేక ఐఎంఎల్ డిపో వెలవెలబోయింది. రెండు రోజుల్లో దాదాపు రూ.15కోట్ల మద్యం ఎగుమతులు నిలిచిపోయాయి. అనంతరం ఐఎంఎల్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. వైన్స్ అసోసియేషన్ నాయకులు గుర్రాల శ్రీనివాసరెడ్డి, గొర్రెపాటి నరేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

పండితాపురం పశువుల సంత వేలం వాయిదా

కామేపల్లి, మార్చి 11: కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం శ్రీకృష్ణ ప్రసాద్ పశువుల సంత బహి రంగ వేలం వాయిదా పడింది. ఈపాటలో కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీ చెందిన పాటదారులు బానోత్ నర్సింహనాయక్, భూక్య వీరన్న, ధరావత్ నాగేశ్వరరావు, బోడ శ్రీను నలుగురు దారవత్తు సొమ్ము రూ.30 లక్షలు, సాల్వెన్సీ రూ.5లక్షలు కట్టారు. అనంతరం పాటను ప్రభుత్వం రూ.2కోట్ల40లక్షల11వేల840 మద్దతు ధరను ప్రకటించారు. పాటదారులు ఆధరకు పాడలేమని అధికారులకు తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రవీందర్, డీఎల్పీఓలు ప్రభాకర్, ప్రభాకర్, ఎంపీఓలు జీవిఎస్, రాజారావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో 144సెక్షన్ పటిష్ఠంగా అమలు చేశారు.

మహిళాభివృద్ధికి కృషి చేయాలి: దొండపాటి

ఖమ్మం వ్యవసాయం, మార్చి 11: ప్రతి ఒక్కరూ మహిళాభివృద్ధికి కృషి చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడు, రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ డైరెక్టర్ దొండపాటి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని కార్యాలయంలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు నేడు ప్రతి రంగంలో ముందకు దూసుకెళ్తున్నారని కొనియాడారు. డీసీసీబీ కార్యాలయంలో ఎక్కువ భాగం మహిళా ఉద్యోగులే విధులు నిర్వహిస్తున్నారన్నారు. మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాల్లో పోటీ పడుతున్నారన్నారు. వారికి మనం సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈవో అబిద్‌ఉర్ రహమాన్, బ్యాంక్ డైరెక్టర్ పునుకొల్లు రామబ్రహ్మం, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొణిజర్ల, మార్చి11: ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన సోమవారం మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలో చోటు చేసుకుంది. మండలంలోని తనికెళ్ల గ్రామానికి చెందిన చల్లా సీతారాములు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. బైక్‌లపై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.


చోరీకి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి

కామేపల్లి, మార్చి 11: చోరీకి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి చేసిన సంఘటన కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో సోమవారం జరిగింది. పండితాపురం గ్రామానికి చెందిన శ్రీరాముల ధనమ్మ ఇంటికి తాళం వేసి కూలీ పనులకు వెళ్లింది. గ్రామంలో చెత్త కాగితాలు ఏరుకుంటూ ప్రసాద్ అనే వ్యక్తి తాళం వేసి ఉన్న ధనమ్మ ఇంటి తాళం పగలకొట్టి ఇంట్లో చొరబడి దొంగతనానికి యత్నించడంతో చుట్టు పక్కల వాళ్లు గమనించి ఆదొంగను పట్టుకొని దేహశుద్ధి చేసి వదిలేశారు.

నేటి నుంచే రంజాన్

(మొదటి పేజీ తరువాయి)

ముస్లింలు భావిస్తారు. అలాగే ఎంతో శుభప్రదమైన ఈ నెలలో నరకలోక ద్వారాలు మూసుకుని, స్వర్గలోకపు ద్వారాలు తెరుచుకుంటాయని వారు నమ్ముతారు. దేవునిపై విశ్వాసాన్ని, భయభక్తులను, భక్తిశ్రద్ధలను తెలుపుకునేందుకు ముస్లింలు రోజా (ఉపవాస దీక్షలు) పాటిస్తారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తూ ఐదుపూటలా నమాజు, ఇషా తరువాత తరావీహ్ (ప్రత్యేక ప్రార్థనలే)తో పాటు అర్ధరాత్రి పూట తహజ్జుద్ నమాజ్ పేరుతో ఏకాంత ఆరాధనలో లీనమవుతుంటారు. చివరి పది రోజులలో ఎతేకాఫ్ పాటిస్తారు. అలాగే ధనవంతుడైన ప్రతి ముస్లిం దానధర్మాలకు అధిక ప్రాధాన్యమిస్తారు. తమ ఆస్తిలో రెండున్నర శాతం తీసి పేదలకు పంచిపెడతారు. నెల రోజుల అనంతరం నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలను ముగించి రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్)ను జరుపుకుంటారు. మరోవైపు రంజాన్ నెలవంక దర్శనంతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని పాతబస్తీలో మటన్, చికెన్ షాపులు, కూరగాయల మార్కెట్‌లు, కిరాణా షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.



రంజాన్‌కు ముస్తాబైన మక్కా మసీద్

ముస్లింలకు సీఎం రంజాన్ శుభాకాంక్షలు

నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ముస్లింలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణనిస్తుందని అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. ముస్లింల సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించి, వారి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు అమలు చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఆనాడు కేసీఆర్ పేషీలో

ఒక్క దళితుడున్నారా?

చిన్న సంఘటనపై బీఆర్ఎస్ విష ప్రచారం.. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, బీర్ల అయిలయ్య

హైదరాబాద్/న్యూఢిల్లీ/జగిత్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన పేషీలో ఒక్క దళితుడైనా ఉన్నారా అంటూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో జరిగిన చిన్న సంఘటనను చూపి ఏదో అయినట్లు బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుడు చేస్తోందని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.. తెలంగాణ తొలి సీఎంగా దళితుడిని చేస్తానన్న కేసీఆర్.. చేశాడా అని ప్రశ్నించారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆయన ఎలా అవమానించిందీ ప్రజలే చూశారన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు దళిత మంత్రులు ఎన్ని సార్లు కలవగలిగారని ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో పూర్వమున్న వసతులనూ సీఎం రేవంత్ కల్పిస్తున్నారని.. గుట్టలో నిద్రచేసే వెసులుబాటు, కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాట్లు చేశారని విప్ అయిలయ్య అన్నారు. కాంగ్రెస్‌కు క్రెడిట్ దక్కుతుందని చెప్పి.. డిప్యూటీ సీఎం భట్టికి అవమానం జరిగిందంటూ బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తుందని దుయ్యబట్టారు. భట్టి కూర్చున్న కుర్చీ చిన్నగా ఉన్నందు వల్ల అలా కనిపిస్తోందని వివరణ ఇచ్చారు. మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన కేటీఆర్‌కు.. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ అన్నారు. సీఎంను గురించి ఆయన పిచ్చిమాటలు మాట్లాడితే ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో చేర్చడం ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ గురించి అనవసర వ్యాఖ్యలు చేస్తే హైదరాబాద్‌లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల్లో సీఎం రేవంత్‌కు ఉన్న ఆదరణ చూసి కేటీఆర్ ఓర్చుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. 'బిడ్డా కేటీఆర్..! మా సీఎం రేవంత్‌పైన మాట్లాడే స్థాయి నీకుందా? నీ భాష మార్చుకోక పోతే బట్టలు ఊడదీసి ఉరికిస్తం.. నువ్వు మొగోనివైతే లోక్‌సభ ఎన్నికల్లో సిరిసిల్లలో మెజారిటీ తెచ్చి చూపించు!'అని సవాల్ విసిరారు. రేవంత్ పట్ల కేటీఆర్ మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. కేసీఆర్ ఎక్కడ రాజకీయాలు మొదలుపెట్టి ఎక్కడ మంత్రి, డిప్యూటీస్పీకర్ అయ్యారో కేటీఆర్ చెప్పాలన్నారు. కేటీఆర్ ఇలాగే మాట్లాడితే తెలంగాణ ప్రజలు.. బీఆర్ఎస్‌కు ఉన్న ప్రతిపక్ష హోదా లేకుండా చేసి బయటకు పంపుతారన్నారు.



జగిత్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రెండ్రోజుల్లో గొల్లకురమల కార్పొరేషన్

గొల్ల, కురమల కార్పొరేషన్‌ను మరో రెండ్రోజుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటుతో గొల్ల, కురుమలకు లబ్ధి చేకూర్చుతుందన్నారు. గొల్ల కురమలకు బీఆర్ఎస్ పదేళ్ల పాటు అన్యాయం చేసిందని మండిపడ్డారు. గొల్ల కురుమలకు 4 అసెంబ్లీ సీట్లు కేటాయించి.. అధికారంలోకి రాగానే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్ నిలబెట్టుకుంటున్నారని వెల్లడించారు.

మోదీకి చిత్తశుద్ధి లేదు:వీహెచ్

ఓబీసీ ప్రధాని అని చెప్పుకొనే నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి బీసీలకు ఏం చెప్తారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ప్రశ్నించారు. కులగణన చేస్తామని ప్రకటించడానికి వస్తున్నారా? అని నిలదీశారు. ఓట్ల కోసం అయోధ్య రామమందిరం, కాశీ గురించి మాట్లాడడమే తప్ప బీసీల అభివృద్ధి పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో వీహెచ్ మాట్లాడుతూ.. కులగణన కోసం మోదీని ఓబీసీ ఎంపీల బృందం ఆధ్వర్యంలో నాలుగు సార్లు కలిసినప్పటికీ హామీ ఇవ్వలేదన్నారు. కాగా, జగిత్యాలలో ఇటీవల జరిగిన మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ రెబల్‌గా పోటీ చేసి విజయం సాధించిన అడువాల జ్యోతి లక్ష్మణ్ కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం జగిత్యాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

22 ఎకరాల నిషేధిత జాబితా భూమి..

ఎంపీ సంతోష్‌కు పట్టా

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. "సంతోష్ అనే బీఆర్ఎస్ ఎంపీ, వారి కుటుంబానికి చెందినవారి పేరుమీద కూడా భూములున్నాయి. అప్పటివరకు 22(ఎ) కింద నిషేధిత జాబితాలో ఉన్న భూమి వారి పేరిట పట్టా అయింది. ఆ గ్రామంలో అందరి భూములూ నిషేధిత జాబితాలో ఉంటాయి. కానీ, ఆయనకు మాత్రం ఆ 22 ఎకరాలు పట్టా అయిపోయింది" అని కోదండరెడ్డి అన్నారు. ఎంపీ సంతోష్ భార్య, ఓ ఎమ్మెల్సీ, ఇద్దరు ఆ పార్టీ నేతలు కలిసి ఒకే గ్రామంలో నిషేధిత జాబితాలో ఉన్న 22 ఎకరాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ నలుగురికి చెందిన ఒక కంపెనీ పేరుతో ఈ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఎలా పట్టాలుగా మార్చుకున్నారనేందుకు ఇది ఒక్క ఉదాహరణ మాత్రమేనన్నారు. ఇలాంటి రిజిస్ట్రేషన్లపై తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. మరోవైపు వివాదరహితంగా ఉన్న 23 లక్షల ఎకరాలను వివాదాస్పద భూముల కేటగిరీ(బీ)లో చేర్చారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగనన్ని భూ కుంభకోణాలు ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో జరిగాయని ధ్వజమెత్తారు. ఎవరినీ సంప్రదించకుండా గతంలో దివాళా తీసిన విదేశీ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు అప్పగించారని కోదండరెడ్డి తెలిపారు. ఆ తర్వాత ఇదే కంపెనీ టెరాసీస్, క్వాంటెల్లాగా పేర్లు మార్చుకుందని వివరించారు. ఈ మూడు కంపెనీలు రాష్ట్రానికి చెందిన రామలింగరాజు కుటుంబీకుడు శ్రీగారి శ్రీధర్‌రాజు పేరిట ఉన్నాయని తెలిపారు. రామలింగరాజు కుటుంబానికి కేటీఆర్‌తో అవినాభావ సంబంధం ఉందన్నారు. ధరణి పేరుతో కేసీఆర్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, ఆ శాఖ మంత్రిగా కూడా ఉన్న గత సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దీనికి ప్రధాన కారణమని కోదండరెడ్డి ఆరోపించారు. కేటీఆర్ తన కార్యాలయంలో ధరణికి సంబంధించి ప్రత్యేకంగా ఒక వ్యవస్థనే పెట్టుకున్నారని తెలిపారు.

17 వరకు స్పెషల్ డ్రైవ్..

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్‌ను మరో వారం రోజులపాటు పొడిగించారు. దరఖాస్తులు భారీగా వస్తున్నందున దీనిని ఈ నెల 17 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు 2.45 లక్షల ధరణి దరఖాస్తులు పరిష్కారం దిశగా ఉన్నాయని తెలిపింది.

ప్రణీత్‌రావు ఎక్కడ?

» సిరిసిల్లలో పంజాగుట్ట పోలీసుల గాలింపు
» అదుపులోకి తీసుకున్నట్లుగానూ ప్రచారం?
» పథకం ప్రకారమే ట్యాపింగ్.. డేటా మాయం
» హార్డ్ డిస్క్‌ల ధ్వంసం కేసులో కీలక ఆధారాలు
» గత ప్రభుత్వ పెద్దల అండతో ఎస్ఐబీలో హవా
» ప్రతిఫలంగానే అడ్డదారిలో ఆయనకు పదోన్నతి?
» ప్రణీత్‌కు సహకరించిన అధికారుల్లో గుబులు

హైదరాబాద్ సిటీ, సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సస్పెండైన డీఎస్పీ ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావు ఎక్కడ ఉన్నారనేది తెలియడం లేదు. ఫోన్‌లు స్విచ్ఛాఫ్ ఉండడంతో పాటు, అజ్ఞాతంలోకి వెళ్లినట్లు అనుమానిస్తూ ఆయనను పట్టుకునేందుకు హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం వీరు సిరిసిల్ల వచ్చి స్థానిక శ్రీనగర్ కాలనీలో ప్రణీత్ అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద రాత్రి వరకు పహారా కాసినట్లు తెలిసింది. ఓ దశలో అదుపులోకి తీసుకున్నారని, రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఏ సమయంలోనైనా హైదరాబాద్ తరలించే అవకాశం ఉందని ఊహాగానాలు వచ్చాయి. అయితే, ప్రణీత్ విషయం తమకు తెలియదని, పంజాగుట్ట పోలీసులకే సమాచారం ఉంటుందని సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు. పంజాగుట్ట పోలీసులు సైతం ప్రణీత్ ఇంకా దొరకలేదని చెప్పారు. హైదరాబాద్‌లోని స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) డీఎస్పీగా పనిచేస్తున్న ప్రణీత్ ఫిబ్రవరి 20న బదిలీపై సిరిసిల్ల డీసీఆర్బీలో చేరారు. రిపోర్టు చేసిన వెంటనే హైదరాబాద్ వెళ్లిపోయినట్లు తెలిసింది. ట్యాపింగ్ ఆరోపణలతో ఈ నెల 5న సస్పెండయ్యారు. కాగా, ఎస్ఐబీ కార్యాలయంలో.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజు ప్రతిపక్ష నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించిన హార్డ్ డిస్క్‌లను ప్రణీత్ ధ్వంసం చేశారని ఆదివారం అదనపు ఎస్పీ రమేష్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ప్రణీత్‌తో పాటు, మరికొందరిపై పంజాగుట్ట స్టేషన్‌లో ఐపీసీ 409, 427, 201, 120(బి), సెక్షన్(3) ఆఫ్ పీడీపీపీ యాక్ట్, 65, 66, 70 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయి.

పథకం ప్రకారం ఎస్ఐబీకి.. 'అద్భుత పనితీరు'తో డీఎస్పీ

గత ప్రభుత్వంలోని పెద్దలతో దగ్గరి బంధుత్వం ఉండడం, వారి అండతో ప్రణీత్ పథకం ప్రకారం ఎస్ఐబీకి వెళ్లి చక్రంతిప్పినట్లు పోలీసులు కీలక సమాచారం సేకరించారు. 2007 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన 2018లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం ఎస్ఐబీకి మార్చగా ఆ విభాగం ఉన్నతాధికారుల తోడ్పాటుతో రెండు గదుల్లో ఇంటర్నెట్ కనెక్షన్‌తో 17 కంప్యూటర్లను అనధికారికంగా ఏర్పాటు చేసుకున్నారు. వ్యక్తుల సమాచారాన్ని రహస్యంగా, అనధికారికంగా, చట్ట విరుద్ధంగా సేకరించడమే కాక స్వయంగా పర్యవేక్షించినట్లు కచ్చితమైన ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఎన్నికల ఫలితాలు విడుదలైన మరుసటి రోజే ఎస్ఐబీ కార్యాలయంలో సీసీ కెమెరాలు బంద్ చేయించి, టెక్నీషియన్ సాయంతో కంప్యూటర్లలోని డేటా, కీలక వివరాలు కాపీ చేసుకుని, హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసి కాల్చివేశారు. తనపై అనుమానం రాకుండా కొత్త హార్డ్ డిస్క్‌లను ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలింది. కాగా, చెప్పినట్లు చేసినందుకు 'అద్భుతమైన పనితీరు' కింద నిరుడు మార్చిలో ప్రణీత్‌కు డీఎస్పీగా పదోన్నతి ఇచ్చారు. దీనిపై ఆయన బ్యాచ్‌మేట్స్, ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. మరోవైపు ట్యాపింగ్‌లో కొందరు అధికారులకూ పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రణీత్ తర్వాత వీరినీ విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం మేరకు ఈ కుట్రలో ఎవరి పాత్ర ఎంత..? అనేది దానిపై దర్యాప్తు చేస్తున్నారు. కేసు సంచలనంగా మారుతుండడంతో ప్రణీత్‌కు సహకరించిన ఉన్నతాధికారుల్లో గుబులు మొదలైంది.

సీఎం సార్... మా మొర ఆలకించండి!

» ఆర్ అండ్ బీలో సర్వీస్ రూల్స్ ఖరారు చేయండి
» సీఎం రేవంత్‌కు, మంత్రి కోమటిరెడ్డికి ఉద్యోగుల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ అంశాన్ని పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. గత ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దాంతో తమకు పదోన్నతులు వచ్చినా అవి తాత్కాలికమే కావడంతో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్థాయి హోదాలోనే పదవీ విరమణ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆర్ అండ్ బీ లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్‌ను పరిష్కరిస్తే దాదాపు 300 నుంచి 400 మంది ఉద్యోగులకు పదోన్నతులు కలుగుతాయన్నారు. వాస్తవానికి ఆర్ అండ్ బీ పదోన్నతుల అంశం ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన సీనియారిటీ జాబితాపై ఆధారపడి ఉన్నప్పటికీ సర్వీస్ రూల్స్ తేలితే కిందిస్థాయి పదోన్నతులు ఒక కొలిక్కి వస్తాయని ఉద్యోగులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్లూఎస్ శాఖల్లో సర్వీస్ రూల్స్ పూర్తయ్యాయని, తమ శాఖలోనూ అందుకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయినా గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పెండింగ్‌లో ఉండిపోయిందని పలువురు ఉద్యోగులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. కాగా సర్వీస్‌రూల్స్‌ను ఖరారు చేస్తే ఆర్ అండ్ బీలో జరిగిన పునర్వ్యవస్థీకరణతో ఏర్పడిన కొత్త కార్యాలయాలకు సిబ్బంది పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

తవ్విన కొద్దీ బయటపడుతున్న

అక్రమ పౌరసత్వాలు!

» తాజాగా 125 పెరిగిన సంఖ్య.. 24 మంది అరెస్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విదేశీయులకు అడ్డదారుల్లో పౌరసత్వం ఇచ్చిన కేసులో సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించి.. నకిలీ గుర్తింపు, విద్య, ఇతర ధ్రువీకరణ పత్రాలు పొంది.. వాటి ఆధారంగా పాస్‌పోర్టులు పొందిన వారి సంఖ్య తొలుత 95గా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు అనుబంధంగా మరికొన్ని చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదవుతుండడం.. ఈ ముఠాలకు పశ్చిమబెంగాల్‌లోని ఫేక్ సర్టిఫికెట్ల గ్యాంగ్‌తో లింకులను సీఐడీ నిర్ధారించింది. కొత్తగా మరో 30 మంది ఇలా అక్రమంగా పాస్‌పోర్టులు తీసుకున్నట్లు గుర్తించారు. దీంతో.. నకిలీ పత్రాలతో పౌరసత్వాన్ని పొందిన విదేశీయుల సంఖ్య 125కు చేరింది. చెన్నైకి చెందిన పాస్‌పోర్టు ఏజెంట్ మురళీధరన్ రాధ ఈ కేసులో కీలకంగా వ్యవహరించినట్లు తేల్చారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తే.. ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ కేసులో సీఐడీ ఇప్పటి వరకు 24 మందిని అరెస్టు చేసింది. విదేశాలకు వెళ్లినట్లు గుర్తించిన వ్యక్తుల వివరాలను ఇప్పటికే ఇమిగ్రేషన్, పాస్‌పోర్టు అధికారులు అందజేశామని, వారిని భారత్‌కు రప్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఐడీ అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు అరెస్టయిన వారిలో హైదరాబాద్‌కు చెందిన ఫేక్‌సర్టిఫికెట్ల తయారీదారుడు అబ్దుల్ సత్తార్, డి.అశోక్‌రావు, మరియప్పన్, మునీందర్, చాంద్‌ఖాన్, హబీబుల్లా జైలులో ఉండగా.. మిగతా వారు బెయిల్‌పై బయటకు వచ్చారు.

ఏపీలో బీజేపీకి 6 ఎంపీ, 10 అసెంబ్లీ సీట్లు

» 144 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ పోటీ
» 8 గంటలపాటు మూడు పార్టీల నేతల భేటీ

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పొత్తుల్లో ఎవరికి ఎన్ని సీట్లు అనే అంశంపై టీడీపీ, జనసేన, బీజేపీ తుది నిర్ణయానికి వచ్చాయి. సోమవారం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ ప్రతినిధులుగా కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఎంపీ వైజయంత్ పాండే సుమారు 8 గంటలు చర్చలు జరిపారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఈ భేటీ జరిగింది. అనంతరం... ఏ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేయనున్నదీ వివరిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం... తెలుగుదేశం పార్టీ 17 పార్లమెంటు, 144 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుంది. జనసేన రెండు లోక్‌సభ, 21 అసెంబ్లీ స్థానాల్లో బరిలో దిగనుంది. ఇక... బీజేపీ ఆరు పార్లమెంటు, పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుంది. పొత్తుల్లో భాగంగా బీజేపీ, జనసేనకు కలిపి 8 పార్లమెంటు, 30 అసెంబ్లీ స్థానాలను ఇవ్వాలని తొలుత భావించారు. ఇప్పుడు... అసెంబ్లీ స్థానాల సంఖ్య 31కి పెరిగింది. తొలుత జనసేనకు 24 అసెంబ్లీ, మూడు పార్లమెంటు సీట్లు ఇచ్చారు. బీజేపీతో పొత్తు అనంతరం జనసేన ఒక ఎంపీ స్థానాన్ని, 3 అసెంబ్లీ స్థానాలను త్యాగం చేయాల్సి వచ్చింది. టీడీపీ కూడా ఒక అసెంబ్లీ స్థానాన్ని తగ్గించుకోవాల్సి వచ్చింది.

వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డికి బెయిల్

» సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ఆంధ్రలో అడుగుపెట్టొద్దు
» రెండు పూచీకత్తులు సమర్పించాలి: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక నిందితుడు (ఏ-5) దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో అధిక శాతం సాక్షులు ఉన్న ఆంధ్ర రాష్ట్రంలోకి సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ప్రవేశించరాదని స్పష్టం చేసింది. రూ2 లక్షల వ్యక్తిగత బాండ్, రెండు పూచీకత్తులు సమర్పించాలని.. ప్రతి సోమవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్)లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. పిటిషనర్ సీబీఐ కోర్టులో పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని.. దర్యాప్తునకు సహకరించాలని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం ఆదేశాలిచ్చారు. శివశంకర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను గతేడాది సెప్టెంబర్లో హైదరాబాద్ సీబీఐ కోర్టు కొట్టివేసింది. ఈ హత్య కేసులో 2021 నవంబర్ నుంచి జైల్లో ఉంటున్నానని.. సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టేసి బెయిల్ మంజూరు చేయాలని ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ మేరకు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. ఆయన సాక్షులను ప్రభావితం చేస్తే సీబీఐ లేదా సునీతారెడ్డి ఆయన బెయిల్ రద్దుచేయాలని కోరవచ్చంటూ విచారణను ముగించింది.

జేబీబీ పార్టీలో చేరిన కోడికత్తి శ్రీను

» అమలాపురం నుంచి ఎన్నికల బరిలోకి...

విజయవాడ(ఆంధ్రజ్యోతి), ముమ్మిడివరం, మార్చి 11: జనిపల్లి శ్రీనివాసరావు(కోడికత్తి శ్రీను) రాజకీయ రంగప్రవేశం చేశారు. సోమవారం ఆయన జై భీమ్‌రావ్ భారత్ పార్టీలో చేరారు. విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంక పెదపేటలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో సామాన్యులకు న్యాయం జరిగే వరకు తాను పోరాటం సాగిస్తానని ప్రకటించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా అవి సక్రమంగా అర్హులకు చేరడం లేదన్నారు. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు.

మా కుటుంబం త్వరలోనే టీడీపీలోకి: మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో అద్భుతాలు జరుగడం ఖాయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసే విధంగా కృషిచేస్తానని తెలిపారు. సోమవారమిక్కడ ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడు రాఘవరెడ్డితో కలిసి తాను పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.


సీసీ రోడ్లకు శంకుస్థాపన

మధిరరూరల్,మార్చి11:మండల పరిధిలోని ఆత్కూరు, కృష్ణాపురం గ్రామాల్లో ఎంపీ నామ నాగేశ్వర రావు నిధులతో మంజూరైన సీసీ రోడ్లకు సోమవారం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీ నామ నిధులు మంజూరు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావూరి శ్రీను, అబ్బూరి రామన్, అబ్బూరి సంధ్యారాణి పాల్గొన్నారు.

మంచాల నాణ్యత పరిశీలన

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 11: జిల్లాలో ఎస్టీ, ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టల్స్‌లో చదివే విద్యార్థుల కోసం తయారు చేస్తున్న ఐరన్‌బెడ్స్ నాణ్యతను కలెక్టర్ వి.పి.గౌతమ్ పరిశీలించారు.సోమవారం నూతన కలెక్టరేట్ సముదాయ భవనంలో జిల్లా జైళ్లశాఖ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్స్‌లోని విద్యార్థులకు ఈ ఐరన్ బెడ్‌లను తయారు చేయిస్తున్నారు. ఇందుకు సంబంధించిన నమూనా బెడ్స్ నాణ్యత ప్రమాణాలను కలెక్టర్ పరిశీలించారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



ఖమ్మం
ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి

మంగళవారం 12 మార్చి 2024

ప్రజావాణి ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

» కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 11: ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులపై సత్వరమే స్పందించి, పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, బి సత్యప్రసాద్, డీఆర్వో రాజేశ్వరి, ఆర్డీవో గణేష్, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో తహసీల్దార్ లతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి ఫైల్స్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్

ప్రక్రియపై సమీక్షించారు. మండలాల వారీగా ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని క్షేత్రస్థాయిలో ఎన్ని పరిశీలించారు. ఎన్ని అర్హతగా ఉన్నాయనే విషయాలను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ అంశాలపై తహసీల్దార్‌లకు కలెక్టర్ పలు ఆదేశాలు చేశారు. సాధ్యమైనంత వరకు దరఖాస్తుల పరిష్కారాన్ని వేగిరం చేయాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా రెవిన్యూ అధికారి రాజేశ్వరి, ఆర్డీవో గణేష్, కలెక్టరేట్ ఏవో అరుణ, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు నాగేశ్వరావు, మదన్ గోపాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యలను పెండింగ్‌లో ఉంచొద్దు

నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి

ఖమ్మంకార్పొరేషన్: గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చిన అర్జీలకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, వాటిని పెండింగ్‌లో ఉంచవద్దని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కమిషనర్ ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. మొత్తం 35 అర్జీలు రాగా వాటిని పరిశీలించిన కమిషనర్ పరిష్కారానికై సంబంధిత అధికారులకు అందచేశారు. గత సోమవారం వచ్చిన అర్జీల పరిష్కారానికై తీసుకున్న చర్యలపై తనకు నివేదిక అందచేయాలన్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో నగరపాలకసంస్థ కార్యాలయంలోని పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు వెల్లడించాలి

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

తల్లాడ, మార్చి11: ఎన్నికల బాండ్ల వివరాలను అందించాలని సుప్రీంకోర్టు తీర్పును నిర్లక్ష్యం చేసిన ఎస్‌బీఐ అధికారులను వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, శీలం సత్యనా రాయణరెడ్డి, నల్లమోతు మోహన్‌రావు, చల్లా నాగేశ్వర రావు, సూదా హన్మంతరావు, అనుమోలు కృష్ణయ్య, యాస వెంకయ్య, గరిడేపల్లి రామకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

ఖమ్మంసంక్షేమవిభాగం: బీజేపీకి కార్పొరేట్ శక్తులు అందించిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం ప్రధాన రహదారి వెంట ఉన్న ఓ బ్యాంకు ఎదుట నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వై విక్రమ్, మాదినేని రమేశ్, మెరుగు సత్యనారాయణ, ఎస్ నవీన్‌రెడ్డి, ఎస్‌కే మీరా, బత్తిని ఉపేందర్, ప్రతాపనేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెనుబల్లి: ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎస్‌బీఐ చైర్మన్



తల్లాడలో సీపీఎం నాయకుల నిరసన

ఎన్నికల సంఘానికి తెలియజేయాలని వీఎంబంజర్ ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు చలమాల, మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరులో ఎస్‌బీఐ బ్రాంచి కార్యాలయం వద్ద సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా కార్యాక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మాదాల వెంకటేశ్వరరావు, నాయకులు తన్నీరు కృష్ణార్జునరావు, ఎం అంజయ్య, నరసింహారావు, హనుమయ్య, పుల్లయ్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత వెంకటప్పయ్యకు ఘన నివాళి

కొణిజర్ల, మార్చి11: మండల పరిధిలోని పెద్దగోపతి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఎలనాటి వెంకటప్పయ్య దశదిశకర్మ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నేతలు ఘన నివాళులు అర్పించారు. టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు రామనాథం, రాష్ట్రకార్యదర్శి కూరపాటి వెంకటేశ్వరరావు, మోత్కూరి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు తాతా సుధాకర్, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌లాల్, కొండబాల కోటేశ్వరరావు, కిలారు కిరణ్, సామినేని నరసయ్య, చిన్నపుల్లయ్య, నారాయణరావు, కోసూరి శ్రీనువాసరావు, గుమ్మా రోశయ్య, భాగం హేమంతరావు, పోటు ప్రసాద్, బొంతు రాంబాబు, తాళ్ళపల్లి కృష్ణ, నల్లమల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడి మృతి

ఖమ్మంరూరల్, మార్చి11: మండల పరిధిలోని పల్లెగూడేనికి చెందిన సీపీఎం సీనియర్ నాయకులు గడ్డిపొప్పుల యేసు (68) సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా ఇన్‌చార్జీ కార్యదర్శి యర్రా శ్రీకాంత్, పాలేరు ఇన్చార్జ్ బండి రమేష్, లు ఆయన మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు.

శ్రీవారి ఎదుర్కోలు ఉత్సవం

తల్లాడ, మార్చి11: తల్లాడలోని హన్మత్ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం గరుడ వాహనంపై శ్రీనివాసమూర్తి ఎదుర్కోలు ఉత్సవం వైభవంగా జరిగింది. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీదేవి, భూదేవి, పద్మావతిదేవి, గోదాదేవి అమ్మవార్లకు పసుపు కుంకుమ, ఆంజనేయస్వామివారికి అరటిపండ్లతో తులాభారం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

28న మధిర బార్ అసోషియేషన్ ఎన్నికలు

మధిరటౌన్,మార్చి11: మధిర బార్ అసోషియేషన్ ఎన్నికలు ఈనెల 28న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి సి.గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ఈనెల 18 నుంచి 20వరకు, నామినేషన్ల ఉపసంహరణకు 22 వరకు గడువు ఉంటుందని తెలిపారు. మార్చి 28న ఎన్నిక నిర్వహించి, అదేరోజు ఫలితాలు వెలువరిస్తామన్నారు.

జీరో కరెంట్ బిల్లు కోసం మరోసారి దరఖాస్తులు

ఖమ్మంకార్పొరేషన్, మార్చి11: అర్హులైనప్పటికీ జీరోబిల్లు రాకపోవటంతో తిరిగి ఆన్‌లైన్ చేయించుకునేందుకు దరఖాస్తుదారులు సోమవారం నగర పాలకసంస్థకు వెల్లువెత్తారు. విద్యుత్‌బిల్లులు, మీటర్ నెంబర్లు, ఆధార్, ఆహార భద్రతాకార్డులు ఇచ్చేందుకు పెద్దసంఖ్యలో రావటంతో నగరపాలకసంస్థ కార్యాలయం కిటకిటలాడింది. రాష్ట్ర ప్రభుత్వం ఆరుగ్యారెంటీల అమలులో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ఇస్తామని ప్రకటించారు. కాగా నగరపాలకసంస్థ పరిధిలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్న పలువురికి జీరోబిల్లులు రాలేదు. అయితే అర్హత కలిగిన వారందరూ తిరిగి వివరాలు అందించాలని అధికారులు సూచిస్తూ నగర పాలకసంస్థ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీంతో దరఖాస్తులు చేసేందుకు భారీసంఖ్యలో వస్తున్నారు. కొంతమంది దరఖాస్తులు ఆన్‌లైన్ కాకపోవటంతో తిరిగి దరఖాస్తులు ఇస్తున్నారు. అయితే వరుసగా మూడురోజులు సెలవులు రావటంతో సోమవారం తమ విద్యుత్ వివరాలు నమోదు చేసుకునేందుకు దరఖాస్తుదారులు భారీసంఖ్యలో నగర పాలకసంస్థ కార్యాలయానికి వచ్చారు.



సైన్స్ టాలెంట్ సెర్చ్‌లో 'హార్వెస్ట్'కు రాష్ట్రస్థాయి ర్యాంక్



విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి11: డాక్టర్ ఏఎస్‌రావు అవార్డు కౌన్సిల్ నిర్వహించిన సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని ధాత్రిజ రాష్ట్రస్థాయి 3వర్యాంక్ సాధించింది. ఈ వివరాలు పాఠశాల యాజమాన్యం తెలిపింది. రాష్ట్రస్థాయిలో 10లోపు ర్యాంకులు 6 సాధించామన్నారు. గణితం, బయలజీ సైన్స్‌కు సంబంధించి పాఠశాలకు చెందిన టి రేవంత్‌కుమార్ రాష్ట్రస్థాయి 4వ ర్యాంక్, తోపాటు పలువురు విద్యార్థులు 10లోపు ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో ఈనెల 10న నిర్వహించిన అవార్డు కార్యక్రమంలో ప్రశంశా పత్రం, నగదు బహుమతులు అందించారని తెలిపారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో తల్లంపాడు పాఠశాలకు ప్రథమ బహుమతి

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి11: ఖమ్మం నగరంలోని పాత డీఈవో కార్యాలయంలోని సైన్స్ మ్యూజియంలో నిర్వహించిన బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ ఎగ్జిబిషన్‌లో తల్లంపాడు పాఠశాలకు ప్రథమ బహుమతి లభించింది. జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ హాజరయ్యారు. కుసుమంచి పాఠశాలకు ద్వితియ బహుమతి, గుదిమళ్ళ పాఠశాలకు తృతీయ బహుమతి లభించింది.

స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్

ఖమ్మంక్రైం, మార్చి11: స్పెషల్ బ్రాంచి ఏసీపీగా ఎన్.వెంకటేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీలో భాగంగా ఆయన ఎస్‌బీ ఏసీపీగా నియమిస్తూ ఇటీవల పోలీసుశాఖ ఉత్తర్వులు వెలువడిన నేపథ్యంలో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీ కార్యాలయంలో సీపీ సునిల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



సత్తుపల్లిరూరల్,మార్చి11: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ముస్లీంలకు సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతలన మేలు కలయిక ఈ రంజాన్ పండుగ అని అన్నారు. దైవప్రార్థనలతో సామరస్యం వెల్లివిరియాలన్నారు.

లింగగూడేనికి తాగునీటి సరఫరా

పెనుబల్లి,మార్చి11: ఐదురోజులుగా మండలంలోని లింగగూడెం ఎస్టీకాలనీలో నీళ్ల రావడం లేదని మహిళలు శనివారం ఆందోళన చేపట్టారు.ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు ఆదివారం పైపులైన్లకు మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

అంగన్‌వాడీకి టీవీ వితరణ

నేలకొండపల్లి,మార్చి11: మండల పరిధిలోని మూటాపురం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీకి గ్రామానికి చెందిన కట్టా రాజేష్, నంబూరి హరీష్ స్మార్ట్ టీవీని, గ్రామానికే చెందిన చావా రమేష్ సీలింగ్ ఫ్యాన్‌ను వితరణ చేశారు. ఎంపీడీఓ ఎర్రయ్య ద్వారా అంగన్‌వాడీ టీచర్ బాలామణికి అందించారు. కార్యక్రమంలో దాతలు రాజేష్, హరీష్, రమేష్,ఎంపీఓ శివ, కార్యదర్శి నర్సింహారావు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏడీసీపీ

ఖమ్మంక్రైం, మార్చి11: అడిషనల్ డీసీపీ అడ్మిన్‌గా ఏ.నరేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన జయశంకర్ భూపాలపల్లి నుంచి బదిలీపై ఖమ్మం వచ్చారు.

చెరువులు నింపాలని వినతి

తిరుమలాయపాలెం, మార్చి11: సాగర్ జలాల ద్వారా చెరువులు నింపాలని సోమవారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మల్లు నందిని

మధిరటౌన్, మార్చి11: మండలం నాగవరప్పాడు గ్రామానికి చెందిన పలువురు సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. భట్టి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాగవరప్పాడు మాజీ సర్పంచ్ చావలి రామరాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి పలు కుటుంబాల వారు కాంగ్రెస్ లోకి చేరారు, వీరికి మల్లు నందిని కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని వారికి ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు, పార్టీలో చేరిన కృష్ణమూర్తి, దోమందుల కోటేశ్వరరావు, దోమందుల శ్రీను, చిన్న శ్రీను తదితరులు ఉన్నారు.

సామాన్యులకు న్యాయం జరిపించారు



ఖమ్మంకార్పొరేషన్, మార్చి11: జస్టిస్ ఎన్వీ రమణ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు సామాన్యులకు న్యాయం జరిగేలా చేశారని, అందులో భాగంగా సుదీర్ఘకాలంగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించిందని పేర్కొంటూ నగరానికి చెందిన పుష్పావతి అనే మహిళ తన భర్త కేఎన్.గుప్తాతో కలిసి ఆదివారం ఖమ్మంలో జరిగిన ఎన్వీ రమణ అభినందన సభలో ఆయనను సన్మానించారు.

గ్రామసభకు రాని అధికారులకు నోటీసులిస్తాం

» కల్లూరు ప్రత్యేక అధికారి చంద్రశేఖర్

కల్లూరు,మార్చి11: గ్రామసభకు హాజరు కాని అధికారులకు నోటీసులిస్తామని కల్లూరు ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ చెప్పారు. సోమవారం కల్లూరు మేజర్ గ్రామ పంచాయితీ కార్యాలయం ప్రాంగణంలో ప్రత్యేక అధికారి అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఈ సభలో 18 శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్ష జరగాల్సి ఉండగా కేవలం మూడు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల్లో మిషన్ భగీరథ, వైద్యా, విద్య, రెవిన్యూ, ఎక్సైజ్, ఆర్‌అండ్‌డి, నీటిపారుదలతో పాటుగా ఇంకాను పలు శాఖల నుంచి ఎవరు రానందున ఆయా శాఖల అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఈ సభలో ఎంపీటీసీ కొండూరి కిరణ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు కమ్లి



సమస్యలను వివరిస్తున్న ఎంపీటీసీ కొండూరి

ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ స్పందిస్తూ సభకురాని అధికారులపై నోటిసులు పంపించి తగిన చర్య నిమిత్తం కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. శాంతినగర్‌లో డ్రెయినేజీ వాటర్ సాగర్ కాల్వలో కలిసేలా చేశారని ఆ నీటిని మళ్లించేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఎంపీటీసీ కిరణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మధిర రోడ్డు వైపున గల డంపిగ్ యార్డ్‌ను తొలిగించినప్పటికి కొంతమంది అక్కడే చెత్త వేస్తున్నారని దీనిని అడ్డుకునేలా చర్యలు తీసకోవాలని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను పలువురు కోరారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.100 మాత్రమే గిట్టుబాటు అవుతున్నాయని మాజీ జడ్పీటీసీ మేకల కృష్ణ ప్రస్తవించారు. పంచాయితీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పగుతున్నారని కోఆప్షన్ సభ్యుడు కమ్లి వివరించారు. ఈ సభలో ఎంపీటీసీ మాదిరాజు లక్ష్మణరావు, పంచాయితీ ఈవో కృష్ణారావు, విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్‌బేగ్ పాల్గొన్నారు.

పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలి

వైరాలో సీపీఎం, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, ప్రదర్శన

వైరా,మార్చి11: వైరా మునిసిపాలిటీలో పెంచిన ఇంటిపన్నుల భారాన్ని తగ్గించాలని సీపీఎం, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా, ప్రధాన రహదారిలో ప్రదర్శన నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలను పూర్తి చేయాలని, ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలని కోరారు. వైరా మునిసిపాలిటీలో ఎక్కడా లేనివిధంగా ఇంటిపన్నులను భారీగా పెంచి బలవంతంగా వసూలు చేయటాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, మునిసిపల్ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, తీవ్రంగా ఖండించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ సీహెచ్. వేణుకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇంటిపన్నులపై



ధర్నా చేస్తున్న సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు

నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. మునిసిపల్ కౌన్సిలర్లు వనమా విశ్వేశ్వరరావు, దారెల్లి పవిత్రకుమారి, తడికమళ్ల నాగేశ్వరరావు, అప్పం సురేష్, సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, మాదినేని దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నాదెండ్ల బ్రహ్మయ్యది కిరాతక హత్య

సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి11: కామ్రేడ్ నాదెండ్ల బ్రహ్మయ్యను కిరాతకంగా హత్య చేశారని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఖండించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. బాల్యం నుంచి పీడీఎస్‌యూలో పనిచేస్తూ రాష్ట్ర నాయకుల స్థాయికి ఎదిగారని, ఏపీలోని గుంటూరు జిల్లాలో ఉద్యమాభివృద్ధికి కృషి చేశారన్నారు. కామ్రేడ్ నాదెండ్ల బ్రహ్మయ్య సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీలో పనిచేస్తూ చంద్రన్న కుడి భుజంగా ఉంటూ జిల్లా కార్యదర్శిగా రాష్ట్రకమిటీ సభ్యుడిగా పని చేశారని వివరించారు.

నేలకొండపల్లిలో నేడు ఆటల పోటీలు

నేలకొండపల్లి,మార్చి11: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నేలకొండపల్లి భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు పాలడుగు పూర్ణచంద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని, నిర్వహణకు నేలకొండపల్లి సేవా కమిటీ సహకరించనున్నట్లు తెలిపారు.

వేతనాలు విడుదల చేయాలి: ఇఫ్టూ

నేలకొండపల్లి, మార్చి11: నేలకొండపల్లి పీహెచ్‌సీలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.ఈ వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం సీహెచ్‌సీ వైద్యాధికారికి వినతి పత్రం అందించారు.

జీపీ కార్మికుల ధర్నా

వైరా,మార్చి11: వైరా నియోజకవర్గంలోని గ్రామపంచాయతీ వర్కర్లు తమ పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం వైరాలోని ఎమ్మెల్యే ప్రైవేట్ క్యాంపు కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గత ఆరునెలల నుంచి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బందికి అందజేశారు. సీఐటీయూ నాయకులు నరేంద్ర, రామారావు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

ఏన్కూరు, మార్చి11: వ్యవసాయ మార్కెట్ కమిటీలో పని చేస్తున్న హమాలీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మంకెన కృష్ణ అన్నారు. సోమవారం ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో హమాలీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు రామారావు, వెంకన్న, రమేష్, నాగరాజు, సురేష్, కృష్ణ, నరసింహారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన అధికారి బాధ్యతల స్వీకరణ

ఖమ్మంవ్యవసాయం, మార్చి11: జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి బీవీ రమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వీపీ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యాన పంటలు అభివృద్ధిని వేగవంతం చేయాలని పామాయిల్ సాగు పెంచాలని కలెక్టర్ సూచించారు.

జీరో బిల్లు అందజేత

రఘునాథపాలెం,మార్చి11: రఘునాథపాలెం మండలంలోని శివాయిగూడెంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూక్యా బాలాజీనాయక్ ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. గ్రామంలోని గిరిజన మహిళలకు జీరో బిల్లును అందించారు. కాగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంజూరు చేయించిన కోయచెలకలో సీసీ రహదారులను మాజీ ఉపసర్పంచులు కే పూర్ణచంద్రరావు, ఎండపల్లి సత్యం, చెరుకూరి సీతారాములు, మాదంశెట్టి హనుమంతరావు ప్రారంభించారు.

మాదిగ ఉద్యమకారులపై కేసులను ఎత్తివేయాలని సీపీకి వినతి

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి11: దండోరా ఉద్యమంలో పోరాటం చేసిన మాదిగ ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ విన్నవించారు. సోమవారం పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం సీపీ సునీల్‌దత్‌కు వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో పడిశాల వెంకన్న మాదిగ, కనకపుడి వీరస్వామి, దుప్పటి ప్రకాష్‌బాబు, నంద్రు వెంకన్న పాల్గొన్నారు.

రన్‌ఫర్ జీసస్ పోస్టర్ ఆవిష్కరణ

కల్లూరు, మార్చి 11: కల్లూరులో సోమవారం రన్‌ఫర్ జీసస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎనోష్‌కుమార్, ఎన్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గర్రాల సత్యాంందం, రాష్ట్ర కోఆర్డినేటర్ గంగవరపు దేవసహాయం, తేళ్ల ఎబినేజర్ ఆవిష్కరించారు.

నీటి ఎద్దడి నివారణకు నిధులు మంజూరు చేయాలి

తల్లాడ, మార్చి11: మండలంలో వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణ కోసం రూ.కోటి నిధులను మంజూరు చేయాలని మండలపరిషత్ సమావేశంలో సభ్యులు విన్నవించారు. సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ తరచూ మరమ్మతుల దృష్ట్యా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా జరగడం లేదని పేర్కొన్నారు. పంపుసెట్లు, చేతిపంపులు మరమ్మతులు సకాలంలో చేపట్టకపోవడంతో తాగునీటి ఎద్దడి నెలకొందని వివరించారు. మండలంలో అదనపు పైపులైన్ల నిర్మాణం, బోర్ల రిపేర్లకు అదనంగా మరో పంపు మెకానిక్‌ను నియమించాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.చంద్రమౌళి, ఎంపీవో కె.శ్రీదేవి, ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్, ఏవో ఎండీ.తాజుద్దీన్, వైద్యాధికారి డాక్టర్ రత్నమనోహర్, ఏఈలు సింధు, అశోక్, రాజేష్, సుందర్, ఏపీవో కోటయ్య, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

మధిరరూరల్, మార్చి 11: మధిర-తొండలగోపారం రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం గుర్తు తెలియని రైలు కింద పడి గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ వ్యక్తి సమాచారాన్ని గుర్తిచేందుకు ఖమ్మం అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహాయంతో మధిర ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహన్ని భద్రపరిచారు. మృతుడి వయస్సు సుమారుగా 35 ఏళ్ల ఉండొచ్చని తెలిపారు. రైల్వే జీఆర్‌పీ ఎస్ఐ భాస్కర్‌రావు కేసు నమోదు చేశారు.

బీటెక్ ఫలితాల్లో మదర్‌థెరిస్సా విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లి,మార్చి11: బీటెక్ మొదటి సంవత్సరం, మొదటి సెమిస్టర్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ సోమవారం తెలిపారు. 12మంది ఉత్తమర ఫలితాలు సాధించారని చెప్పారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ జాకీర్ హుస్సేన్, బేసిక్ విభాగం అధిపతి పీ.మారేశ్వరరావు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు